సాక్షి
అనంతపురం

శనివారం । 19 । అక్టోబర్ । 2024



క్రిప్టో మాయ.. ప్రజల సొమ్ము పాయె

క్రిప్టో కేటుగాళ్లు బరితెగించారు. రోజువారి ఆదాయం ఆశ చూపి వెబ్‌సైట్ ద్వారా వందలాది మందిని బురిడీ కొట్టిస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.40

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి ధర రూ.26 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/22.4°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. మధ్యాహ్నం ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ కార్యాలయంలో శనివారం జరగనుంది. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు సీఈఓ లక్కిరెడ్డిపల్లె వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ యాదవ్ సహా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారని వివరించారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలతో పాటు వాటి పరిష్కారానికి అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఆయన సూచించారు. భారీ వర్షాలు-వరదలు, వ్యవసాయ, విద్య, వైద్యంతో పాటు చైర్‌పర్సన్ అనుమతితో ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నట్లు సీఈఓ తెలిపారు.

లచ్చానుపల్లి యువతికి భారీ ప్యాకేజీతో జాబ్



జ్యోత్స్న

గుత్తి రూరల్: గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి రూ.1.2 కోట్ల వార్షిక ప్యాకేజీతో జాబ్‌కు ఎంపికై ంది. గుత్తి మండలం లచ్చానుపల్లికి చెందిన ప్రభుత్వ న్యాయవాది పి.వి.తిమ్మారెడ్డి, పాటిల్ పార్వతి దంపతుల కుమార్తె జ్యోత్స్న ఈ ఘనత సాధించింది. జ్యోత్స్న ఒకటి నుంచి పదో తరగతి వరకు గుత్తిలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో, ఇంటర్మీడియెట్ కర్నూలు, ఇంజినీరింగ్ గుత్తి గేట్స్ కళాశాలలో చదివింది. అనంతరం అమెరికాలోని బ్రిడ్జ్‌పోర్ట్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసి.. అక్కడ క్యాంపస్ సెలెక్షన్‌లో విస్నేబాగో ఇండస్ట్రీస్‌లో ఉద్యోగానికి ఎంపికైంది. చిన్న గ్రామం నుంచి బాగా చదువుకొని భారీ ప్యాకేజ్‌తో ఉద్యోగానికి ఎంపికైన జ్యోత్స్నను గ్రామస్తులు, సన్నిహితులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

పండ్ల వ్యాపారికి ఆరు నెలల జైలు శిక్ష

- కాల్షియం కార్బైడ్‌తో రేగి పండ్లను మాగబెట్టిన ఫలితం

అనంతపురం: అనంతపురం మార్కెట్‌యార్డులో కాల్షియం కార్బైడ్ ద్వారా మాగబెట్టిన రేగి పండ్లను అమ్మిన వ్యాపారికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. 2015 సంవత్సరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు మార్కెట్‌యార్డులో ఆకస్మికంగా తనిఖీలు చేసి రేగిపండ్లను పరిశీలించారు. కార్బైడ్‌తో మాగబెట్టినట్లు అనుమానం రావడంతో పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. రేగిపండ్లలో కార్బైడ్ అవశేషాలు ఉన్నట్లు నివేదిక వచ్చింది. దీంతో రేగిపండ్ల వ్యాపారి అశ్వర్థరెడ్డిపై కేసు నమోదు చేసి..కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అభియోగాలు రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ అనంతపురం ఫస్ట్‌క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ శివశంకర్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

అన్న చెప్పాడు.. ఆక్రమిస్తున్నాం!

- దళితుల శ్మశానానికి ఎసరు
- టీడీపీ చోటా నాయకుల బరి తెగింపు
- పరిటాల సిద్ధార్థ్ పేరుతో కబ్జా



శ్మశానంలోని సమాధులు

రాప్తాడురూరల్: కాదేదీ కబ్జాకు అనర్హమన్నట్టుగా రెచ్చిపోతున్నారు టీడీపీ నేతలు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూములు, స్థలాలు, చివరకు ప్రైవేటు ఆస్తులను సైతం కబ్జా చేస్తున్నారు. శ్మశానాలనూ వదలడం లేదు. వీరి అకృత్యాలకు శవాలు సైతం ఘోషిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అనంతపురం రూరల్ మండలంలో టీడీపీ నాయకుల దూకుడు ఎక్కువగా ఉంది. ప్రభుత్వ భూములు, స్థలాలను భారీగా చెరబడుతున్నారు. తాజాగా శుక్రవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో శ్మశాన స్థల దురాక్రమణ అంశం వెలుగులోకి వచ్చింది. స్థానిక బీఎస్‌ఆర్ కాలనీ ఎదురుగా ఉన్న దళితుల శ్మశాన స్థలంపై కన్నేసిన 'తమ్ముళ్లు'..జేసీబీతో చదును చేయించారు. దళితులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు పరిటాల సిద్ధార్థ్ పేరు చెప్పి భయపెట్టారు. 'అన్న చెప్పాడు.. మేము చదును చేయిస్తున్నాం. ఏదైనా ఉంటే అన్నతోనే మాట్లాడుకోండి. తహసీల్దార్‌తోనూ అన్న మాట్లాడాడు. మీరు ఏమి చేసినా పనులు నిలబెట్టేది లేదు' అంటూ తెగేసి చెప్పారు. దీంతో దళితులు వెంటనే తహసీల్దార్ మోహన్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు.

2008లో రెండు ఎకరాల కేటాయింపు

దళితుల శ్మశాన వాటిక కోసం రాచానపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నంబరు 83-3లో రెండు ఎకరాల భూమిని 2008 సంవత్సరంలో ప్రభుత్వం కేటాయించింది. రాచానపల్లి నుంచి అక్కంపల్లికి వెళ్లే దారిలో రోడ్డుపక్కనే ఈ శ్మశాన వాటిక ఉంది. ఇప్పటికే ఇక్కడ పలువురి మృత దేహాలను ఖననం చేశారు. 70 దాకా సమాధులు వెలిశాయి. ఇంకా ఎకరం దాకా స్థలం ఖాళీగా ఉంది. దీన్ని టీడీపీ నాయకులు కబ్జా చేస్తున్నారు. అనంతపురం నగర శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ సెంటు స్థలం రూ.3 లక్షల దాకా పలుకుతోంది. తద్వారా సుమారు రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని కొట్టేయడానికి పూనుకున్నారు. పరిటాల సిద్ధార్థ్ పేరు చెబుతూ పట్టపగలే చదును చేయిస్తున్నారు.



జేసీబీతో దళితుల శ్మశాన స్థలాన్ని అక్రమంగా చదును చేస్తున్న దృశ్యం

కేసు పెట్టాలని చెప్పా

శ్మశాన భూములను సంరక్షించే బాధ్యత పంచాయతీ అధికారులదే. రాచానపల్లిలో దళితుల శ్మశాన స్థలాన్ని కొందరు చదును చేయిస్తున్నారంటూ కొందరు నాకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడా. వీఆర్‌ఓతో కలసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పా. శ్మశాన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులదే. చదును చేసేందుకు నేను కూడా అనుమతి ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌కుమార్, తహసీల్దార్

క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం

దళితుల శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసినట్లు తెలిసింది. గ్రామసభ ఉండడంతో ఆవైపు వెళ్లలేదు. తహసీల్దార్ నుంచి ఫిర్యాదు లేఖ అందింది. శనివారం ఉదయం వీఆర్‌ఓ, సర్వేయర్‌తో కలసి శ్మశాన స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం. చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తాం. చదును చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. పంచాయతీ స్థలాల జోలికి ఎవరొచ్చినా ఉపేక్షించం.

– మహమ్మద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి, రాచానపల్లి

10 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

అనంతపురం: నవంబర్ 10 నుంచి 15 వరకు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. అగ్నివీర్ టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్‌కీపర్ టెక్నికల్, 10వ ట్రేడ్స్‌మన్, ఎనిమిదో ట్రేడ్స్‌మన్ పోస్టులకు సంబంధించి గుంటూరులోని డీఎస్‌ఏ స్టేడియంలో ర్యాలీ జరగనుంది. కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల అభ్యర్థులు అడ్మిట్ కార్డులతో ర్యాలీకి హాజరుకావాల్సి ఉంది.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో భాగంగా శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఏపీసీ నాగరాజు ఆధ్వర్యంలో పరిశీలన ప్రక్రియ జరిగింది. టీచింగ్ పోస్టులతో పాటు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, వార్డెన్, అకౌంటెంట్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 1:5 రేషియో ప్రకారం 334 మంది అభ్యర్థులకు సమాచారం అందించారు. వీరిలో 269 మంది హాజరయ్యారు. రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన మెరిట్ జాబితా ఆధారంగా పరిశీలిస్తున్నారు. అయితే చాలామంది ఆన్‌లైన్‌లో ఇష్టానుసారంగా మార్కులు నమోదు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో మార్కులను దృష్టిలో ఉంచుకుని మెరిట్ జాబితా తయారు చేయనున్నారు. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికానుంది. కాగా నాన్‌టీచింగ్ (టైప్-3,4) పోస్టులకు అధికారులపై ఒత్తిళ్లు షురూ అయ్యాయి. ప్రజాప్రతినిధుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తుండడంతో ఈ ప్రక్రియ తలనొప్పిగా మారింది.

జల్లులకే పరిమితమైన జడివాన

- గత మూడు రోజుల్లో 28 మి.మీ నగటు వర్షపాతం నమోదు
- 15 మండలాల్లో కాస్త ప్రభావం చూపించిన తుపాను



అనంతపురం అగ్రికల్చర్: తుపాను చల్లబడింది. వరుణుడు తెరిపిచ్చాడు. తీవ్ర స్థాయిలో భయపెట్టిన వాయుగుండం జిల్లాపై పెద్దగా ప్రభావం చూపించలేదు. జడివానతో ఊరించినా చివరకు తేలికపాటితో సరిపెట్టింది. గత మూడు రోజులుగా భారీ వర్షం కుమ్మేస్తుందని భావించినా 28 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అది కూడా 15 మండలాల్లో ప్రభావం చూపించగా మిగతా మండలాల్లో జడితో కూడిన మోస్తరుగా వర్షం పడింది.

- వాయుగుండం ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించడంతో అందుకు తగ్గట్లు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కానీ ఎక్కడా భారీ వర్షపాతం నమోదు కాలేదు. జడి పట్టుకోవడంతో అక్కడక్కడా పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు ఎక్కడా ప్రవహించలేదు. వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలకు ఇబ్బంది కాగా.. రబీ సాగుకు అనుకూలమని చెబుతున్నారు. ఈ నెల 16న సగటున 1 మి.మీ నమోదు కాగా, 17న కాస్త ఎక్కువగా 15.4 మి.మీ, 18న 12 మి.మీ వర్షపాతం నమోదైంది.

శెట్టూరులో అత్యధికం

ఈ తుపానుకు అత్యధికంగా శెట్టూరు మండలంలో 59.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, రాప్తాడు, అనంతపురం, కళ్యాణదుర్గం, యల్లనూరు, వజ్రకరూరు, గుమ్మఘట్ట, కంబదూరు, ఉరవకొండ, పుట్లూరు, ఆత్మకూరు, కుందుర్పి మండలాల్లో మోస్తరుగా వర్షాలు కురిశాయి. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లకే పరిమితమైంది. వాయుగుండం ప్రభావంతో ఉదయం, రాత్రిళ్లు జడితో కూడిన శీతల వాతావరణం నెలకొనగా, పగలంతా ఉష్ణోగ్రతలు, ఉక్కపోత అధికంగా నెలకొనడం విశేషం.

- అక్టోబర్ నెల సాధారణ వర్షపాతం 100.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 95 మి.మీ నమోదైంది. గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 390.8 మి.మీ గానూ 34.7 శాతం అధికంగా 526.3 మి.మీ నమోదైంది. 21 మండలాల్లో సాధారణం కన్నా ఎక్కువగానూ, 7 మండలాల్లో సాధారణంగానూ, మిగతా మూడు మండలాల్లో సాధారణం కన్నా తక్కువగాను వర్షాలు కురిశాయి. మొత్తం మీద చూస్తే అనుకూల వర్షాలతో ఈ ఏడాది సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

నేటి నుంచి ఫుట్‌బాల్ ట్రోఫీ

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ చరిత్రలో తొలిసారిగా ఆర్డీటీ సౌజన్యంతో అనంత క్రీడా గ్రామం వేదికగా ఆల్‌ఇండియా జోనల్ స్థాయి రాజమాత జీజాబాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ శనివారం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ఎం.డేనియల్ ప్రదీప్ తెలిపారు. ఈ నెల 23 వరకు సాగే టోర్నీలో మొత్తం 16 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటారు. అనంతపురంతో పాటు ఒడిశా, లడఖ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో సమాంతరంగా ఈ టోర్నీ ఆయా జోన్లలో జరుగుతుంది.

మెడికో దుర్మరణం



చైతన్య (ఫైల్)

ఉరవకొండ: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నర్రా సుజాత, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు అధినేత నర్రా కేశన్న దంపతుల కుమారుడు నర్రా చైతన్య(23) శుక్రవారం బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శివమొగ్గలోని ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న చైతన్య బెంగళూరులో ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. చైతన్య మృతిపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనమండలి సభ్యుడు వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, యువనేత వై.ప్రణయ్‌రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుల వివక్ష

- బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..



అంగన్‌వాడీ కేంద్రం వద్ద విచారణ చేపడుతున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, పోలీసులు

బ్రహ్మసముద్రం : కల్లా కపటం తెలియని చిన్నారులకు ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కుల వివక్ష ఎదురైంది. అంగన్‌వాడీకి వచ్చిన చిన్నారులను కేంద్రంలోకి అనుమతించకుండా బయటే కూర్చోబెట్టారు. బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లిలో ఈ నెల 16న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధిత చిన్నారుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. పడమటి కోడిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. కింది కులాలకు చెందిన పిల్లలను లోపలికి అనుమతించకూడదని ఆ ఇంటి యజమాని షరతు పెట్టాడు. లేదంటే కేంద్రం ఖాళీ చేయాలన్నాడు. ఈ షరతుకు అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది తలొగ్గి.. కొందరు దళిత చిన్నారులను బయటే కూర్చోబెట్టారు. ఇది చూసిన చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. గతంలో ఎన్నడూ లేనిది ఇప్పుడు తమ పిల్లలపై వివక్ష చూపించడం తగదని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న దృష్టికి తీసుకెళ్లారు. ఆమె శుక్రవారం పోలీసులతో కలసి పడమటి కోడిపల్లికి చేరుకుని విచారణ చేపట్టారు. అద్దె ఇంటి యజమానితో మాట్లాడారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. చిన్నారులపై ఈ కాలంలోనూ కుల వివక్ష చూపించడం సరికాదన్నారు. మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

29 వరకు 'రీ సర్వే' గ్రామసభలు

అనంతపురం అర్బన్: సమగ్ర భూ సర్వే పూర్తయిన ప్రాంతాల్లో ఈ నెల 29 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ జారీ చేశారు. ఈ వివరాలను సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ శుక్రవారం తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల పరిధిలో 198 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. ఈ నెల 29 వరకు ఉదయం ఒక రెవెన్యూ గ్రామంలో, మధ్యాహ్నం మరొక రెవెన్యూ గ్రామంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. విస్తీర్ణంలో వ్యత్యాసం, భూ స్వభావంలో తేడా, పేర్లతో తప్పులు, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడం, హద్దుల నిర్ణయంలో తేడాలు, తదితర అభ్యంతరాలను గ్రామ సభల్లో స్వీకరిస్తారన్నారు. ఆ తరువాత క్షేత్రస్థాయిలో పరిశీలించి అభ్యంతరాలను నవంబరు 15వ తేదీలోగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

చిన్నారి తల్లులు

- జిల్లాలో టీనేజీ ప్రెగ్నెన్సీల కలకలం
- ఏటా 16వేలకు పైగా బాల్యవివాహాలు
- నెలలు నిండకనే అనారోగ్యంతో జన్మిస్తున్న శిశువులు

అనంత జిల్లాలో వివాహాలు ఇలా

జిల్లా జనాభా (తాజా అంచనా)	23 లక్షలు
ఏటా పెళ్లిళ్ల సంఖ్య	44,000
ఇందులో బాల్యవివాహాలు	16,412(37.3 శాతం)
టీనేజీ ప్రెగ్నెన్సీలు (18 ఏళ్లకంటే ముందే తల్లి)	2,625(16 శాతం)
ఏటా నియంత్రిస్తున్న బాల్య వివాహాల సగటు సంఖ్య	350



సాక్షి ప్రతినిధి, అనంతపురం : టీనేజీ ప్రెగ్నెన్సీలు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనంతపురం జిల్లాలో టీనేజీ తల్లులు నమోదవుతుండడం విస్మయం కలిగిస్తోంది. ఓ వైపు బాల్యవివాహాలు, మరోవైపు టీనేజీ వయసులోనే గర్భం దాల్చడం వెరసి తల్లుల ఆరోగ్యం ప్రమాదంలో పడినట్టు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు.. ఉరవకొండ, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం వంటి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్టు తేలింది. మహిళా శిశు సంక్షేమశాఖ చర్యలు సరిగా లేకపోవడం వల్ల ఇలా ఏమైనా జరుగుతోందా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాల్యవివాహాలు.. టీనేజీ ప్రెగ్నెన్సీలు

రాష్ట్రంలో బాల్యవివాహాల్లో అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉంది. ప్రతి వంద పెళ్లిళ్లలోనూ 37 మందికి పైగా 18 ఏళ్లకు ముందే అమ్మాయిలు పెళ్లి పీటలపైకి ఎక్కుతున్నట్టు తాజా పరిశీలనలో తేలింది. ఇందులో 16 శాతం మందికి పైగా 18 ఏళ్లకంటే ముందే తల్లి అవుతున్నట్టు తేలింది. జిల్లాలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు ఎంత దారుణంగా ఉన్నాయో అంచనా చేయొచ్చు. టీనేజీ ప్రెగ్నెన్సీ కారణంగా మాతృ మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. బిడ్డలు రకరకాల లోపాలతో పుడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

వివిధ జిల్లాల్లో నవజాత శిశువుల మృతులు ఇలా..

జిల్లా	శిశువుల జననం	శిశు మరణాలు	ప్రతి 1000కి మృతి
అనంతపురం	40,067	381	10
చిత్తూరు	28,277	397	14
శ్రీసత్యసాయి జిల్లా	28,818	263	10
వైఎస్సార్ జిల్లా	37,084	517	14

టీనేజీ ప్రెగ్నెన్సీతో వచ్చే సమస్యలు

- బరువు తక్కువగా పిల్లలు పుట్టడం లేదా నెలలు నిండకముందే పుట్టడం.
- రక్తహీనత సమస్య ఎక్కువగా ఉండే అవకాశం.
- ప్రెగ్నెన్సీ సమయంలో అధిక రక్తపోటుతో తల్లికి ప్రాణాపాయ పరిస్థితి రావడం.
- పిల్లలు పుట్టగానే మృతి చెందడం లేదా గర్భస్థ శిశువు (కడుపులో ఉన్నప్పుడే) మృతిచెందడం.
- పిల్లలు పుట్టినా సరైన ఎదుగుదల లేకుండా ఉండటం.
- ప్రసవ సమయంలో రక్తస్రావం ఎక్కువగా ఉండటం.
- రెండో బిడ్డ ప్రసవానికి మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం.

టీనేజీ ప్రెగ్నెన్సీ రిస్కే



టీనేజీ ప్రెగ్నెన్సీ రిస్క్‌తో కూడుకున్నదే. ప్రతి నెలా రెండు, మూడు కేసులు వస్తున్నాయి. అమ్మాయిలకు 21 ఏళ్లలో ప్రసవం మంచిది. 18, 19 ఏళ్ల వయసులో గర్భంతో రక్తహీనత, బీపీ, బిడ్డ ఎదుగుదల లేకపోవడం, ముందస్తుగా ప్రసవం, తదితర సమస్యలు ఎదురవుతాయి.

– డాక్టర్ శంషాద్‌బేగం, గైనిక్ హెచ్‌ఓడీ, సర్వజనాస్పత్రి

మాతాశిశు మరణాలకు చోటివ్వొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్
- జిల్లాలో నాలుగు మాతృమరణాలకు కారకులైన వారికి మెమో జారీ చేయాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశం





సమీక్షకు హాజరైన వైద్య, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: మాతాశిశు మరణాలు ఒక్కటి కూడా చోటు చేసుకోకూడదని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గర్భిణులకు సంపూర్ణస్థాయిలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా శిశు మరణాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో నాలుగు మాతృ మరణాలు జరిగినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తీసుకొచ్చారు. మరణాల నివారణకు చేపడుతున్న చర్యల గురించి వివరణ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క శిశువూ జన్మిస్తూ మరణించకూడదని, అదే విధంగా ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదని స్పష్టం చేశారు. మరణానికి కారణాలు తెలుసుకుని మునుందు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాలుగు మాతృమరణాలకు సంబంధించి నిర్లక్ష్యం వహించిన వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి మెమో జారీ చేయాలని డీఎంహెచ్‌ఓని ఆదేశించారు. ప్రసవించే సమయంలో గర్భిణులకు వచ్చే సమస్యలపై పీహెచ్‌సీల్లో వైద్యులకు ఓరియంటేషన్‌ను నిపుణులైన గైనకాలజిస్టులతో వారం పాటు నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ కాకుండా సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని ఆదేశించారు. సమీక్షలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కె.ఎస్.వెంకటేశ్వరరావు, గైనిక్ విభాగం అధికారి శంషాద్‌బేగం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


విష్ణువర్ధన్

గుత్తి: స్థానిక గేట్స్ కళాశాలలో ట్రిపుల్‌ఈ ఫైనలియర్ చదువుతున్న విష్ణువర్ధన్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. జేఎన్‌టీయూఏ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో విష్ణువర్ధన్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టులో చోటు దక్కించుకోవడంపై గేట్స్ కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, పీడీ జోయెల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నాసిర్ హుస్సేన్ తదితరులు అభినందించారు.

కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా యుగేశ్వరి

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా తహసీల్దారు యుగేశ్వరిదేవి నియమితులయ్యారు. ఈ మేరకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు యుగేశ్వరిదేవి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఆ విభాగం సూపరింటెండెంట్‌గా ఉన్న అలెగ్జాండర్‌ను పరిపాలనాధికారిగా నియమించారు.

క్రిప్టో మాయ.. ప్రజల సొమ్ము పాయె

- ధర్మవరానికి చెందిన ఓ వ్యాపారి క్రిప్టో కరెన్సీ మోజులో పడ్డాడు. తొలుత భారీగా ఆదాయం వచ్చింది. దీంతో మరికొంత మందిని సభ్యత్వం చేయిస్తే మరింత లాభం వస్తుందని ఆశపడ్డాడు. బంధువులు, స్నేహితులు అందరితోనూ క్రిప్టో కరెన్సీ గురించి చెప్పి ఏకంగా రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించాడు. ఆ తర్వాత క్రిప్టో కరెన్సీ మోసం బట్టబయలైంది. ప్రస్తుతం రోజూ బెంగళూరులోని క్రిప్టో కరెన్సీ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లడం.. సాయంత్రానికి ధర్మవరానికి చేరుకోవడం నిత్య కృత్యమైంది. పెట్టిన డబ్బు ఇవ్వరు.. బంధువుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. బయటకు చెబితే అవమానం. క్రిప్టో కరెన్సీ మోజులో పడి మోసపోవద్దంటూ ఇప్పుడు ఆయన అందరినీ చైతన్య పరుస్తున్నాడు.
- అనంతపురం నగరానికి చేరుకున్న తెలంగాణకు చెందిన నాలుగు ఏజెన్సీలు క్రిప్టో కరెన్సీని భారత ప్రభుత్వం ఆమోదించిందని, కావాలంటే క్రిప్టో కరెన్సీ వెబ్‌సైట్ చూడండి అంటూ నమ్మబలుకుతున్నాయి. రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజూ 10 అమెరికన్ డాలర్లు వస్తాయని అంటున్నాయి. ఈ లెక్కన రోజూ రూ.800 ఆదాయం ఉంటుందని, ఇంతకంటే మంచి వ్యాపారం మరొకటి లేదంటూ నమ్మబలుకుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల సంఖ్యలో ఈ మాయలో చిక్కుకున్నారు.
- అనంతపురం నగరంలో బ్లాక్‌మనీ అధికంగా ఉండే వ్యాపారస్తులు ఓ వెబ్‌సైట్‌ను నమ్మి క్రిప్టో కరెన్సీలో రూ.15 కోట్ల దాకా పెట్టుబడి పెట్టారు. తొలుత బాగానే లాభాలు వచ్చాయి. వారం కిందట వెబ్‌సైట్ అప్‌డేట్ చేస్తున్నామని సమాచారం ఇచ్చి లింక్ తొలగించారు. దీంతో రోజూ వెబ్‌సైట్ చూసుకుంటున్నారు కానీ, ఎలాంటి ప్రగతి లేకపోవడంతో పాటు అడ్రస్ గల్లంతు కావడంతో తేలు కుట్టిన దొంగల్లా మారింది వారి పరిస్థితి.

... ఇలా వీరు మాత్రమే కాదు... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా మంది అత్యాశపరులు క్రిప్టో కరెన్సీ మోజులో పడి విలవిల్లాడుతున్నారు.

- ఖాళీ అవుతున్న అత్యాశపరుల జేబు
- రూ.లక్ష కడితే రోజూ 10 అమెరికన్ డాలర్లు అంటూ మోసం
- వాట్సాప్ గ్రూపుల వేదికగా బరితెగిస్తున్న క్రిప్టో కేటుగాళ్లు
- ఇప్పటికే మోసపోయిన వందలాది మంది



సైబర్ విభాగాన్ని పటిష్టం చేస్తున్నాం

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ మోసాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అనుమానాస్పద వెబ్‌సైట్లు, అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాం. సైబర్ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తున్నాం.
– వల్లూరు శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ డీఎస్పీ

అనంతపురం: రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఆకర్షిస్తోంది. డిజిటల్ కరెన్సీ క్రిప్టో పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. తమకు లాభాలు వచ్చాయని కొందరు చెబుతుంటే, చాలా మంది నష్టపోయినట్లు తెలుస్తోంది. పదుల సంఖ్యలో యాప్‌ల ద్వారా వ్యాపారం జరగడం, ఇందులో కొన్ని మూతబడినట్లు చెబుతుండటంతో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన మధ్య తరగతి ప్రజల ఇళ్లు గుల్ల కాగా, పోలీసుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ మాయా జూదం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తూనే ఉంది. మోసపోయిన వారిలో బడా వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులే అధికంగా ఉండడం గమనార్హం.

అనంతలోనూ దందా..

క్రిప్టో కరెన్సీ అనేది ఒక డిజిటల్ కరెన్సీ. ఇది ఏ దేశానికీ చెందదు. ఏ నియంత్రణ సంస్థ పరిధిలోకి రాదు. ప్రభుత్వ నియంత్రణ కానీ, బ్యాంకుల మధ్యవర్తిత్వం కానీ ఏవీ ఉండవు. ఇద్దరు వ్యక్తులు లేదా సంస్థల మధ్య నేరుగా బదిలీ చేసుకోగల డిజిటల్ కరెన్సీ మాత్రమే. దీనికి ఎలాంటి చట్టబద్ధత ఉండదు. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన కొందరు వ్యక్తులు అనంతపురం నగరంలో పాగా వేసి వందలాది మందిని క్రిప్టో ముగ్గులోకి లాగారు. రూ.లక్ష కడితే రోజూ అమెరికన్ డాలర్లు వస్తాయని నమ్మబలకడంతో ఉచ్చులోకి చిరు వ్యాపారులు, తక్కువ ఆదాయం ఉన్న వారు చిక్కుకున్నారు. ఇందుకు పెద్ద ఎత్తున వెలసిన వాట్సాప్ గ్రూపులే నిదర్శనం. ఇంత పెద్ద ఎత్తున దగా చేస్తున్నా.. నిఘా వ్యవస్థ నిద్రపోతోంది. ఈ తరహా మోసాలపై పోలీసులు కనీసం చైతన్య పరిచే పాపాన పోలేదంటే వ్యవస్థ పనితీరు ఎంత నిద్రాణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరానికి మెడికోలు


మెడికోలను అభినందిస్తున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు హర్యానాలోని మీరాపూర్, రివారిలోని ఇందిరాగాంధీ యూనివర్సిటీ వేదికగా భారతదేశ యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన జాతీయ సేవా పథకం శిబిరానికి అనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల (జీఎంసీ) విద్యార్థులు ఎంపికయ్యారు. అర్హత సాధించిన 2కే23 బ్యాచ్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం మెడికోలు జానకీదివ్యతేజ్, దివ్య షేకావత్‌ను ఆ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జీఎంసీలో మెరుగైన విద్యతో పాటు క్రీడలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరానికి యూనివర్సిటీ పరిధిలో కేవలం ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేయగా ఇందులో స్థానిక వైద్య కళాశాలకు చెందిన ఇద్దరు ఉండడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు పాల్గొన్నారు.

టీచర్లకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ

- ఈ నెల 21 నుంచి ప్రారంభం
- హాజరు కానున్న అనంత, కర్నూలు జిల్లాల్లోని 2,674 మంది టీచర్లు
- ఏర్పాట్లు చేస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసి (ఎఫ్‌ఎల్‌ఎన్) పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. 2026 నాటికి 1,2 తరగతుల పిల్లలందరికీ కనీసం చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ఈ శిక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై బోధనా మెలకువలపై నిష్ణాతులైన వారితో అవగాహన కల్పించనున్నారు. 20 రోజుల చొప్పున మూడేళ్ల పాటు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కొనసాగనుంది. 20 రోజుల్లో ఆరు రోజులు భౌతిక (ఆఫ్‌లైన్) పద్ధతిలో, 14 రోజులు ఆన్‌లైన్ పద్ధతిలో శిక్షణ ఉంటుంది.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అధికారులు

గురుకుల విధానంలో శిక్షణ

భౌతిక పద్ధతిలో సాగే ఎఫ్‌ఎల్‌ఎన్ (జ్ఞానప్రకాష్ 60 రోజుల కార్యక్రమం) శిక్షణ ఈ నెల 21 నుంచి పూర్తిగా గురుకుల విధానంలో ప్రారంభం కానుంది. బుక్కరాయసముద్రం మండలంలోని ఓ డీఎడ్ కళాశాలను శిక్షణా కేంద్రంగా ఎంపిక చేశారు. జిల్లాలోని 31 మండలాల్లో మొత్తం 1,424 మంది టీచర్లను ఎంపిక చేయగా ఇందులో 756 మంది మహిళలు, 668 మంది పురుషులు ఉన్నారు. అలాగే కర్నూలు జిల్లా నుంచి దాదాపు 1,250 మంది టీచర్లు హాజరుకానున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలతో పాటు వసతి సదుపాయం కల్పించనున్నారు. అనంతపురం జిల్లా నుంచి 125 మందిని, కర్నూలు జిల్లాకు చెందిన 125 మంది చొప్పున ఎంపిక చేసి ఒక్కో విడతకు 250 మంది చొప్పున ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా సింగిల్ స్కూల్ టీచర్లకు తొలి నాలుగు విడతలు మినహాయింపు ఉంటుంది. ఈ లోపు వారికి ఎలా శిక్షణ ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

అందరు హాజరుకావాల్సిందే

1,2 తరగతుల పిల్లలకు పూర్తిస్థాయి అభ్యసనం అమలు కావాలనే ఉద్దేశంతో మూడు సబ్జెక్టులపై టీచర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది చాలా మంచి కార్యక్రమం. మండలాల వారీగా ఏ విడతలో ఎంతమందిని ఎంపిక చేశామో వారందరూ శిక్షణకు కచ్చితంగా హాజరు కావాల్సి ఉంటుంది. ఆరు రోజుల పాటు ఇక్కడే ఉండేలా సిద్ధమై రావాలి. ఏ చిన్న ఇబ్బంది లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం.
– నాగరాజు సమగ్రశిక్ష ఏపీసీ

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు

- 'సాక్షి' ఎడిటర్‌పై కేసు నమోదుతో ఫోర్త్ ఎస్టేట్ పై దాడి
- సాక్షి టీవీ నిలుపుదల ట్రాయ్ ఆదేశాలకు విరుద్ధం
- కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



ఉరవకొండ: కుట్రలో భాగంగానే సాక్షి దిన పత్రిక ఎడిటర్ వర్ధెల్లి మురళిపై కేసు నమోదు చేయించి పత్రికా స్వేచ్ఛపై చంద్రబాబు దాడికి శ్రీకారం చుట్టారని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఫోర్త్ ఎస్టేట్‌పై దాడి తగదని హితవు పలికారు. శుక్రవారం అనంతపురంలోని తన స్వగృహంలో పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త రమణతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలను పాలకులు నెరవేర్చడం లేదని అభ్యుదయ వాదులు, రచయితలు, మేధావులు, రాజకీయపక్షాలు, పత్రికలు ప్రశ్నించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. సాక్షి ఎడిటర్ మురళిపై క్రిమినల్ కేసు నమోదు చేయించి, మీడియాపై కుట్రపూరిత దాడి చేయడం ద్వారా తాను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల నుంచి తప్పించుకోవచ్చునన్న సీఎం చంద్రబాబు తప్పుడు ఆలోచనలకు నిదర్శనమన్నారు. వ్యతిరేక కథనాలు ప్రచురితమైతే వాటిని ఖండిస్తూ రీజాయిండర్ ఇచ్చి హుందాగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. 19(1)ఏ ప్రకారం మీడియా ప్రసారాలను నిలుపుదల చేసే హక్కు లేదని ట్రాయ్ చెప్పినా చంద్రబాబు ప్రభుత్వం కేబుల్ యజమానులు, ఆపరేటర్లపై ఒత్తిడి తీసుకెళ్లి సాక్షి టీవీ ప్రసారాలను అడ్డుకోవడం ద్వారా ప్రజాగొంతుక నొక్కే ప్రయత్నం చేస్తోందని మండి పడ్డారు. ఈ విషయంగా న్యాయస్థానాలు నేరుగా జోక్యం చేసుకోవాలని, లేకపోతే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మట్కా కేసులో నేమకల్లు ఆలయ ధర్మకర్త


పోలీసుల ఎదుట చేతులు కట్టుకుని నిలబడిన ఆలయ ధర్మకర్త హనుమంతప్ప (వృత్తంలోని వ్యక్తి)

బొమ్మనహాళ్: ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకలోనూ ప్రసిద్ధిగాంచిన నేమకల్లు ఆంజనేయస్వామి క్షేత్ర ధర్మకర్తగా ఉన్న కె.హనుమంతప్ప మట్కా రాస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో శుక్రవారం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీకి చెందిన ముఖ్య నాయకులే ఆలయానికి ధర్మకర్తగా ఉండాలంటూ ఒత్తిళ్లు చేశారు. దీంతో హనుమంతప్పను తాత్కాలిక ధర్మకర్తగా నియమించారు. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న హనుమంతప్పకు ఆలయ బాధ్యతలు అప్పగించడంపై అప్పట్లో సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినా టీడీపీ నాయకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆలయంలో తనకు కేటాయించిన గదిలో మట్కా రాస్తూ పట్టుబడినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైన దేవదాయ శాఖ అధికారులు స్పందించి హనుమంతప్పను ఆలయ తాత్కాలిక ధర్మకర్త స్థానం నుంచి తప్పించాలని భక్తులు కోరుతున్నారు.

'ఆప్టా' కౌన్సిల్ సమావేశం రేపు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) 2వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈ నెల 20న అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సంఘం బాధ్యులు సమావేశానికి హాజరై, విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

'టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ విడుదల చేయండి'

అనంతపురం ఎడ్యుకేషన్: మునిసిపల్ టీచర్ల సీనియార్టీ, జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలను డీఎస్సీల వారీగా సిద్ధం చేసి విడుదల చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను పాత డీఈఓ కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు ఎస్.రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, జి.సూర్యుడు, జి.కిషోర్ ఉన్నారు.

షికారీలకు పరివర్తన శిక్షణ


రూ.2.7 లక్షల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, విశాలఫెర్రర్

అనంతపురం: పరివర్తన శిక్షణ కార్యక్రమంలో భాగంగా షికారీలకు ఉపాధి నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం నగర శివారులోని ధర్మవరం పంగల్ రోడ్డు వద్ద ఉన్న ఆర్డీటీ సమ్మిళిత ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన పరివర్తన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. షికారీల అభ్యున్నతికి ఆర్డీటీతో పాటు జిల్లా పోలీసు యంత్రాంగం, దాతలు ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పట్టాలు, శాశ్వత గృహాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవని, వాటిని అందించాలని కలెక్టర్‌కు షికారీలు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ.. నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు ముఖ్యమని, అందరికీ అనువైన పనుల్లో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, మగవారి జీవన స్థితిగతులు మెరుగుపడేలా అవసరమైన అంశాలపై నైపుణ్య శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం వికలాంగులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, తదితర ఉపకరణాలను కలెక్టర్ అందజేశారు. ఆర్డీటీ ద్వారా 18 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని ఈ సందర్భంగా ఆ సంస్థ మహిళాసాధికారిత డైరెక్టర్ విశాఫెర్రర్ తెలిపారు.

క్లుప్తంగా

పరామర్శ



కార్మికుడు గౌరీశంకర్‌ను పరామర్శిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గాయపడి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు గౌరీశంకర్‌ను మేయర్ వసీం శుక్రవారం పరామర్శించారు. కమలానగర్‌లో పైప్‌లైన్ పని చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలడంతో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సందర్భంగా మేయర్ వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్మికులకు నగరపాలక సంస్థ ద్వారా అందించే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డీఈలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో శుక్రవారం ఇద్దరు డీఈలు విధుల్లోకి చేరారు. పుట్టపర్తి నుంచి నరసింహ మూర్తి, పబ్లిక్ హెల్త్ కార్యాలయం నుంచి సత్యనారాయణ బదిలీపై అనంతపురం నగరపాలక సంస్థకు వచ్చారు. వారిద్దరూ కమిషనర్ నాగరాజు వద్ద రిపోర్టు చేసుకున్నారు. అంకితభావంతో పని చేసి మంచి పేరు తీసుకురావాలని కమిషనర్ సూచించారు.

ఆర్జేడీని కలిసిన ఏపీడీఎస్ఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పర్యటనకు వచ్చిన పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను శుక్రవారం స్థానిక పాత డీఈఓ కార్యాలయంలో అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏడీపీఎస్ఏ) నాయకులు కలిశారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీపీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి, సీఆర్ఓ రవి చంద్రారెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

రాప్తాడులో చోరీ

రాప్తాడు: మండల కేంద్రంలో నివాసముంటున్న మోకే నాగేంద్ర, మోకే సావిత్రమ్మ దంపతుల ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.... గురువారం సాయంత్రం తమ కుమారుడు అరుణ్‌కుమార్‌తో కలసి భోజనం చేసిన అనంతరం దంపతలిద్దరూ ఇంటిపై నున్న గదిలోకి వెళ్లి నిద్రించారు. రాత్రి వర్షం కురవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తలుపులు తెరిచి పడుకున్నారు. అర్ధ రాత్రి దాటిన తర్వాత ఓ దుండగుడు ఇంటి వెనుక నుంచి లోపలకు చొరబడి పైకి వెళ్లి సావిత్రమ్మ మెడలోని తాళిబొట్టు చైను లాగాడు. వెంటనే మెలుకువ వచ్చిన ఆమె గట్టిగా కేక వేయడంతో చేతికి చిక్కిన సగం చైన్‌తో ఉడాయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కృత్రిమ గర్భోత్పత్తిపై అవగాహన

అనంతపురం అగ్రికల్చర్: మేలు జాతి పశుసంతతి కోసం పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న కృత్రిమ గర్భోత్పత్తిపై శుక్రవారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయ హాలులో పశువైద్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామితో పాటు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఈఓ డాక్టర్ టీవీ సుధాకర్ ఆధ్వర్యంలో సెక్స్ సార్టెడ్ సెమన్ (ఎస్ఎస్ఎస్) ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా వంద శాతం పెయ్యదూడలు జన్మించేలా తీసుకోవాల్సిన చర్యలు, సాంకేతిక పరిజ్ఞానంపై వివరించారు. దీనిపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నూతనంగా విధి విధానాలు, నోడల్ సంస్థతో అంగీకారం కుదిరే పరిస్థితి ఉందని తెలిపారు. పశుశాఖ, డీఎల్‌డీఏ తరఫున అందించాల్సిన సహకారం, వైద్యం గురించి ప్రాథమికంగా చర్చించారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఆశ్రమ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీ శివబాలయోగి ఆశ్రమంలో శుక్రవారం కుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. 15 రోజుల పాటూ అమ్మవారికి వివిధ నిత్య అలంకార సేవలు, వివిధ దేవతామూర్తులకు కల్యాణం జరిపించారు. ఉత్సవాలు ముగియడంతో చివరి రోజు పవిత్ర నదీజలాలతో ఆంజనేయస్వామికి జలాభిషేకం నిర్వహించారు. దసరా వేడుకలకు ముందు పలు పుణ్యక్షేత్రాల నదీ జలాలను తెచ్చి నిత్యం పూజలు చేశారు. ఉత్సవాలు ముగియడంతో ఆ జలాలను ఆలయ పరిసరాల్లో ఊరేగించి స్వామికి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, ప్రసాద్, మల్లికార్జున మాట్లాడుతూ.. దశాబ్దాలుగా శరన్నవరాత్రి ఉత్సవాలను 15 రోజుల పాటూ నిర్వహించి సంప్రదాయంగా వచ్చే నదీజలాల అభిషేకం, శాంతి హోమాలతో వేడుకలు ముగిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.



తపోవనం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు



రుద్రంపేట బైపాస్ నుంచి ఆలమూరుకు వెళ్లే మార్గం ఇలా..

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం



చెరువు కట్టపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



అశోక్ నగర్‌లో వాహనదారుల అవస్థలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నగరంలో రెండ్రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. పలు కాలనీల్లో రోడ్లు దెబ్బతిని బురదమయంగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని సోమనాథ్ నగర్, రంగస్వామి నగర్, ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే మార్గం, సోమనాథ్ నగర్ బ్రిడ్జి, టవర్‌క్లాక్ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. తపోవనం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



టవర్‌క్లాక్ వద్ద గుంతలు పడిన రోడ్డు

మునగతో బోలెడు ప్రయోజనాలు

అనంతపురం అర్బన్: మునగ ఆరోగ్యప్రదాయని అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ఆరోగ్య లాభాలు అందించే మునగను ఆహారంగా తీసుకోవడం దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. మాతాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మునగ ×పోషకారిగవి–ఆరోగ్య ప్రదాయని॰ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునగ వంద రకాల జబ్బులను నిరోధిస్తుందన్నారు. మునగ ఆకు ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని తెలిపారు. మునగలో విటమిన్ ఏ, సీ, కాల్షియం, ఐరన్, పోటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ప్రొటీన్లు, మినరల్స్, అమినో యాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ప్లవనాయిడ్లు లభిస్తాయన్నారు. చక్కెర వ్యాధి, కొవ్వును నియంత్రిస్తుందని పేర్కొన్నారు. చర్మానికి, జుట్టుకు మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

మునగాకు వంటల ప్రదర్శన

రాప్తాడు: మునగాకు తినడం వల్ల 300 రోగాలు నయం అవుతాయని అనంతపురం రూరల్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ప్రసన్నాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, తల్లులకు వివరించారు. ముందుగా మునగాకుతో తయారు చేసిన వంటకాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. గర్భాశయ ముఖద్వార, అండాశయ క్యాన్సర్లను మునగాకు నిరోధిస్తుందన్నారు. లంగ్, లివర్, ఒవేరియన్, మెలనోమా వంటి క్యాన్సర్లకు నిరోధించే సత్తా మునగాకుకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, కార్యకర్తలు సూర్యకళ, సరోజ, ఓబులమ్మ, మాధవి, యల్లమ్మ, ఆయాలు శ్రీలత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

తీర్మానం లేకుండా కమిటీని ఎన్నుకుంటారా?

రాప్తాడు: గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యుల తీర్మానం లేకుండానే లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి (పండమేటి రాయుడు) ఆలయ కమిటీని ఎలా ఎన్నుకుంటారు. ఆ కమిటీ చెల్లదని గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు విలేకరులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా ఆలయ కమిటీ చైర్మన్‌గా గంజి రాముడు ఉన్నాడని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం టీటీడీ, దేవదాయ శాఖ నిధులతో శరవేగంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యుల తీర్మానం లేకుండానే గురువారం ఆలయం వద్ద ఏకపక్షంగా రాప్తాడుకి చెందిన చెడిపోతుల ఆంజనేయ వెంకట్రాముడుని ఆలయ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా చిల్లర లక్ష్మయ్యను ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నించారు. ఆ ఎన్నిక చెల్లదని తెలిపారు. ఆలయానికి చెందిన రికార్డ్స్, ఆలయ తాళాలు తమ దగ్గరే ఉన్నాయని వెల్లడించారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకూ గంజి రాముడే ఆలయ చైర్మన్‌గా కొనసాగుతారని చెప్పారు. ఒకవేళ గంజి రాముడిని ఆలయ చైర్మన్‌గా తొలగించాలంటే స్థానిక శివాలయ వద్ద గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యుల ఆమోదంతో తొలగించి, నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలా ఎవరూ పడితే వారు గుడి దగ్గరకు వచ్చి నేనే ఆలయ చైర్మన్ అంటూ పేపర్లలో వేపించుకుంటే ఆ ఎన్నిక చెల్లదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంజి రాముడు, వైస్ చైర్మన్ ముత్యాల వెంకటరాముడు, పంపు దుబ్బనారాయణ, అంకే నారాయణ, బోయ మారుతి, తలారి లక్ష్మీనారాయణ, నాగరాజు, జూటూరు రాజన్న, బులగొండ నారాయణ స్వామి, బుల్లే పెద్ద ఉజ్జినప్ప, గంజి పందయ్య, దండు ఇటుకు నల్లప్ప, అద్ర ఎరగుంటప్ప, కొండూరు బీరన్న, పాముల్ల కొండప్ప, గంజి లక్ష్మన్న, దండు వన్నూరి, అద్ర నారాయణ స్వామి, చిరుతల పురుపోత్తం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు

చిరు వ్యాపారికి బెదిరింపులు

అనంతపురం క్రైం: ఆర్టీసీకి సక్రమంగా అద్దె చెల్లిస్తూ కాయలు, పండ్లు అమ్ముకునే వ్యాపారి దుకాణానికి అడ్డంగా మరొకరు వ్యాపారం చేస్తున్నారని ప్రశ్నించిన పాపానికి అధికార పార్టీకి చెందిన నేతలమంటూ పలువురు బెదిరింపులకు దిగడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. ఆర్టీసీ ఖాళీ స్థలాలను టెండర్ల ద్వారా దక్కించుకున్న చిరు వ్యాపారి రమేష్ ఫ్రూట్స్ పేరుతో దుకాణంలో పండ్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. అతడికి పోటీగా ఓ కుటుంబం పక్కనే ఉన్న ఖాళీ షాపులో స్టాకు పెట్టుకుని అక్రమంగా రెండు తోపుడు బండ్లు పెట్టి వ్యాపారం చేస్తోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రమేష్ వ్యాపార పరంగా తీవ్రంగా నష్టపోతున్నాడు. నెలకు ఆర్టీసీకి రూ.42 వేలకు పైగా అద్దె చెల్లిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఒక వ్యాపారానికి దుకాణం అద్దెకు ఇచ్చాక పక్కనే అదే వ్యాపారానికి అద్దెకివ్వకూడదు. అలాగని చిరు వ్యాపారికి పోటీగా అక్కడ పండ్లు అమ్ముతున్న వారికి ఎలాంటి అనుమతులు లేవు. ఆర్టీసీ స్థలంలో యథేచ్ఛగా వ్యాపారం చేసేస్తున్నారు. కాగా ఈ అద్దె ఎవరి జేబులోకి వెళ్తుందో అని పెద్ద చర్చ సాగుతోంది. కాగా.. వ్యాపారి రమేష్‌కు అధికార పార్టీకి చెందిన నేతల నుంచి కూడా బెదిరింపులు రావడంతో చిరువ్యాపారులు ముక్కున వేలేసుకుంటున్నారు. అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారికి ఆర్టీసీకి ఎలాంటి సంబంధం లేదని ఆర్టీసీ డీఎం నాగభూపాల్ తెలిపారు.



రమేష్ ఫ్రూట్ షాప్ పక్కన తోపుడు బండ్లపై పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

హామీలన్నీ అమలు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30 వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నామన్నారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహయాదవ్, వెంకట్ నాయక్, అంజినేయులు, వంశీ, చందు, మంజునాథ్, ఏఐఎస్ఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి ఉమామహేష్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మార్కెటింగ్ ఫీజు వసూళ్లు పెంచాలి

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్లు సాధించాలని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణ చౌదరి, ఎల్ఎస్ మూర్తితో కలిసి 16 మార్కెట్ యార్డుల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీలు, 30 వరకు ఉన్న చెక్‌పోస్టులతో పాటు వేరుశనగ, వరి, ఇతరత్రా వ్యవసాయ ఉత్పత్తులు మిల్లుల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టంగా చేపడితే అనుకున్న లక్ష్యాలు సాధించడానికి అవకాశం ఉందన్నారు. చాలా కమిటీలు వెనుకడటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వంద శాతం లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీలకు ఇచ్చిన రూ.12.06 కోట్లకు గానూ ఆరు నెలల కాలంలో 39 శాతంతో రూ.4.75 కోట్లు మేర వసూలైందన్నారు. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న ఏడు మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రూ.5.31 కోట్లు టార్గెట్ ఇవ్వగా ప్రస్తుతానికి 42 శాతంతో రూ.2.23 కోట్లు వసూలైనట్లు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సేవలు, పశువులు, జీవాల సంతలు, చీనీ, చింత, మిరప, ఇతరత్రా వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు తదితర అంశాలపై సమీక్షించారు.

‘విజయభారతి’ డీఎడ్ విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీ

అనంతపురం ఎడ్యుకేషన్: మూతపడిన ‘విజయభారతి’ డీఎడ్ కళాశాల విద్యార్థులకు ఎట్టకేలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని ఈ కళాశాల 2020–22 బ్యాచ్ తర్వాత మూతపడింది. అయితే కొందరు అభ్యర్థులకు ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఇవ్వలేదు. కరస్పాండెంట్ కొండారెడ్డి మృతితో సమస్య మరింత జఠిలంగా మారింది. ఫీజులు పెండింగ్ కారణంగా మొత్తం 9 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. తాము ఫీజు మొత్తం చెల్లించామంటూ విద్యార్థులు చాలా రోజులుగా గగ్గోలు పెడుతున్నారు. కలెక్టర్‌ను పలుమార్లు కలిసి ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ కమిషనర్‌నూ కలిశారు. స్పందించిన విద్యాశాఖ అధికారులు శుక్రవారం పాత డీఈఓ కార్యాలయానికి డీఎడ్ కళాశాల యాజమాన్యం, బాధిత విద్యార్థులను పిలిపించి ఆర్జేడీ శామ్యూల్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ విచారణ జరిపారు. ఫీజు కట్టలేదని యాజమాన్యం తెలపడంతో తాము చెల్లించిన ఫీజుకు సంబంధించిన రసీదులను విద్యార్థులు చూపించారు. ఫీజులను కొండారెడ్డి అనే వ్యక్తికి చెల్లించారని, అయితే తాను కరస్పాండెంట్‌నని మల్లికార్జునరెడ్డి చెప్పుకొచ్చాడు. కరస్పాండెంట్‌తో పని లేదని వారు కళాశాలలో ఫీజులు చెల్లించినట్లుగా ఆధారాలు చూపుతున్నారని పేర్కొంటూ మొత్తం ఏడుగురుకి సర్టిఫికెట్లను అందజేశారు. మిగిలిన వారికి ఇబ్బందులు కలిగించకుండా సర్టిఫికెట్లు అందజేయాలని మల్లికార్జునరెడ్డిని ఆదేశించారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్

జీవనోపాధిని దెబ్బతీస్తున్న రాపిడో, ఓలా

అనంతపురం అర్బన్: ఆటోలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న తమ జీవనోపాధిని రాపిడో, ఓలా, ఉబర్ వంటి సంస్థలు దెబ్బతీస్తున్నాయి. వెంటనే ఆ సంస్థలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. విద్యావంతులై ఉండి పలువురు ఉపాధి కోసం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల రాపిడో, ఓలా, ఉబర్ వంటి సంస్థలు రావడంతో ఆటో డ్రైవర్ల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఒకవైపు బాడుగలు రాక ఫైనాన్స్ ద్వారా తెచ్చుకున్న ఆటోలకు కంతుల కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. చివరికి కుటుంబాలు వీధిన పడే దుస్థితి నెలకొందన్నారు. మరోవైపు ఆటో డ్రైవర్లపై ఆర్టీఓ, పోలీసులు జరిమానాలు విధిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. అనంతరం డీఆర్ఓ రామకృష్ణారెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటనారాయణ, అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు. సీఐటీయూ నాయకులు రామిరెడ్డి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

సంక్షిప్త సమాచారం

బస్టాండ్‌లో దోమల బెడద

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత నెలకొంది. వర్షపు నీరు గుంతల్లో చేరి నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి, సింగంపల్లి తండా, తలుపూరు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు భూమిపూజ చేశారు. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీడీఓ లక్ష్మీనరసింహ వివరించారు. కార్యక్రమంలో తలుపూరు ఎంపీటీసీ ఓబులేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఏపీఓ సుజాత, సెక్రటరీలు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

రాప్తాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రాజశేఖర్ రెడ్డి శుక్రవారం రూ.20 వేలు విలువ చేసే ఆహుజా మైక్‌సెట్‌ను హెచ్ఎం సాంబశివుడుకు వితరణ చేశారు. పీడీ రాజశేఖర్ రెడ్డిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం కేశవ మూర్తి, నల్లప్ప, సాయి ప్రసాద్, గోపాల్ రెడ్డి, కేశవయ్య, అంజనా దేవి, రాజేశ్వరి, విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు ఆదినారాయణ, తరుణ్, చైతన్య, నాగేష్ తదితరులు అభినందించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: పశువైద్యశాలలో మౌలిక వసతులు పెంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట్ల పోతులయ్య ఆధ్వర్యంలో జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రుల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో కాపర్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల ప్రబలి నష్టపోతున్నట్లు గుర్తు చేశారు. పశువుల డాక్టర్లు, కాంపౌండర్ల కొరత కారణంగా సకాలంలో సేవలు అందడం లేదన్నారు. చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సీపీ హరికృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

దేశసేవతో గుర్తింపు



మాట్లాడుతున్న భారత వైమానిక దళ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల, ఎస్వీ డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం ప్రతిష్టాత్మకమైన అగ్నిపథ్ పథకంపై భారత వైమానిక దళ అధికారులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల కల్పతరువు అగ్నిపథ్ ద్వారా సైనికులుగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. దేశ సేవ చేయడం ద్వారా సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అగ్నివీర్ వాయు ఉద్యోగాల కోసం 17.5 నుంచి 21 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైమానిక దళ అధికారికులు సందీప్, సురేంద్ర సింగ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్, ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కళాశాలల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐబీ సిలబస్ తొలగించేందుకు కుట్ర

అనంతపురం ఎడ్యుకేషన్: పవిత్రమైన విద్యా విధానాన్ని కూటమి ప్రభుత్వం మద్యం విధానంగా మార్చిందని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయంలో మద్యం షాపుల లాటరీలు, గవర్నమెంట్ స్కూళ్లల్లో నాణ్యమైన విద్య లేకపోవడం, ఐబీ సిలబస్ తీసివేయాలనే కుట్ర, కార్పొరేట్ విద్యా వ్యవస్థని బలోపేతం చేసే దిశగా నీట్, ఐఐటీ విద్యార్థులను శిక్షణ నారాయణ కార్పొరేట్ కళాశాలలకు ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. గతంలో అంతర్జాతీయ స్థాయిలో గవర్నమెంట్ విద్యార్థుల యొక్క ప్రతిభ కనబడేదన్నారు. కేరళను సైతం విద్యాభివృద్ధిలో వెనక్కునెట్టిన విద్యా పద్ధతుల నుంచి ఈరోజు రాష్ట్రంలో ఏవైపు చూసినా మద్యం గురించి మాట్లాడటం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.

కాలుష్యాన్ని తగ్గించే ఆవిష్కరణలు రావాలి



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: మానవాళికి సవాలుగా మారిన వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే సరికొత్త ఆవిష్కరణల వైపు పరిశోధన విద్యార్థులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూఏలోని కెమికల్ విభాగంలో మూడు రోజులుగా సాగుతున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ‘మెంబరెన్ ప్రాసెస్, ఫర్ ఏ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ ఫ్యూచర్ ప్రాస్పెక్టస్’ అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో కాలుష్య నివారణకు చేపట్టాల్సిన అంశాలపై దృష్టి కేంద్రీకరించడం సంతోషదాయకమన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా మెంబరిన్ టెక్నాలజీ పాత్ర ప్రశంసనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణే మన ముందు ఉన్న ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, సదస్సు కో–కన్వీనర్ డాక్టర్ బి.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజుల ఒత్తిళ్ల నుంచి విద్యార్థులను కాపాడాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా నారాయణ విద్యా సంస్థల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులను ఫీజుల ఒత్తిళ్ల నుంచి కాపాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ఫీజు చెల్లిస్తేనే కళాశాలల్లోకి అనుమతిస్తామంటూ వేధిస్తున్నారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఫీజుల కోసం మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షుడు గణేష్, సాయి, విజయ్ పాల్గొన్నారు.